తెలుగు

వైజ్ఞానిక మాస పత్రిక

నవంబరు 1992

ముఖ్య సంపాదకులు
శ్రీమతి కా. హేమలత

నిర్వాహక సంపాదకుడు
డా. జి. చెన్నకేశవరెడ్డి

సహ సంపాదకుడు
డా. ఎ. పాండయ్య

విడి ప్రతి : రూ. 12 లు.
సంవత్సర చందా : రూ. 140 లు.

సంపుటి : 6
సంచిక : 11

విషయసూచిక

సంపుటి : 6 | నవంబరు 1992 | సంచిక : 11

సంపాదకీయం : ఆధునిక చరిత్ర చతురాననులు దిగవల్లి శివరావు	3
1. రెండు అరవైల తిరుపతి శాస్త్రి	5
2. 1989లో తెలుగు సాహిత్యం - వివాదాలు	10
3. నన్నయ వచన శిల్పం	24
4. ఆధునిక తెలుగు నాటక సాహిత్యం - సామాజిక జీవిత చిత్రణ	34
5. సామెతల ఆమెతలు	40
6. బోధన్ -గ్రామ దేవతలు	45
7. గద్వాల్ సంస్థానంలో స్వాతంత్ర్య ఘట్టాలు	49
8. మధ్యయుగంలో స్త్రీ	56
9. భారతదేశ విదేశీ వ్యాపారంలో వృద్ధి, అస్థిరత్వం	65
10. పర్యావరణంపై జనాభా ప్రభావం - ఒక సమీక్ష	70
11. ప్రాబల్య రాజకీయాలు : నిరాయుధీకరణ సమస్య	77
12. బహుళ సరళరేఖీయత సమస్య	93
13. హరితవిప్లవంలో సస్యప్రజననం - ఇతర జీవ సాంకేతిక విధానాల పాత్ర	104
14. జె.బి.ఎస్. హాల్డెన్	114
15. వ్యవసాయరంగంలో మొక్కల రక్షిత చట్టం (ప్లాంట్ క్వారంటైన్) ప్రాముఖ్యం	125
16. కంప్యూటర్	132
17. ఆవుపాలు - గేదెపాలు	136

"తెలుగు" పత్రికలో ప్రచురితమవుతున్న వ్యాసాలలోని విషయాలకు, వివరాలకు ఆయా రచయితలు/రచయిత్రులే బాధ్యులు

Edited & Published by Smt. K. Hemalatha, Director, Telugu Akademi
Laser-typeset & Printed at : *Chary & Company, 9-4-9,*
Charles Street, Secunderabad - 500 025. Phone : 76650, 75570

ఆధునిక చరిత్ర చతురాననులు

దిగవల్లి శివరావు

పరిశోధనే పరమాశయంగా, చరిత్రరచనే నిత్యవ్యాసంగంగా ఎనిమిది దశాబ్దాలపాటు, అకుంఠిత దీక్షతో, నదలని ఉత్సాహంతో అవిరామంగా పరిశ్రమించి అనేక అపూర్వ చారిత్రక విషయాలను ప్రామాణికమైన రీతిలో వెలుగులోకి తెచ్చినవారు దిగవల్లి వెంకట శివరావుగారు. పరిశోధన, చరిత్ర, సాహిత్యం, న్యాయవాద వృత్తి ఈ నాలుగూ ఆయనకు నాలుగు ముఖాలు. జాతీయవాద దృక్పథంతో ఆంధ్రదేశానికి, భారతదేశానికి సంబంధించిన చారిత్రక విషయాలనెన్నిటినో శతాధిక గ్రంథాలుగా రచించిన దిగవల్లి శివరావు గారు కాకినాడలో 14.2.1898 జన్మించారు. కాలికట్, రాజమండ్రి, మద్రాసు మొదలైన నగరాలలో విద్యాభ్యాసం చేశారు. రాజమండ్రిలో వీరేశలింగం హైస్కూల్లో చదవడమేకాక, వీరేశ లింగంగారికి అంతేవాసికూడా. మద్రాసు ప్రెసిడెన్సి లా కళాశాలలో న్యాయశాస్త్రం చదివి 1920 ప్రాంతంలో పట్టభద్రుడై విజయవాడలో న్యాయవాద వృత్తిని (1966 వరకు) చేపట్టి ఒకవక్క ఆ వృత్తిలో రాణిస్తూ మరోపక్క పరిశోధనలో చరిత్ర రచనలో తలమునకలయి అసంఖ్యాకంగా రచనలు చేసిన అసాధారణ మేధావి. 'ఆయన రచనలు మేజర్ బి.డి.బసు గారి రచనలతో తుల్యమైన'వని సుప్రసిద్ధ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వర రావుగారు కొనియాడారు.

శివరావుగారు భారతదేశచరిత్రకు, ఆంధ్రదేశ చరిత్రకు, కాంగ్రెసు ఉద్యమానికి చేసిన సేవ ఎంతో శ్లాఘనీయమైనది. ఆయన ఒక నడిచే విజ్ఞాన సర్వస్వం, ఒక ఆర్కీవ్స్, ఒక రెడీ రెఫరెన్సు, తరగని విజ్ఞానఖని. ఎన్నెన్నో ఉద్గ్రంథాలను చదివి, ఎంతో నోట్సు రాసిపెట్టుకొని ఎవరు ఎప్పుడు వెళ్ళి ఏ విషయం మీద అడిగినా ఎంతో ఓపికగా ఏ మాత్రం తడుముకోకుండా అపారమైన జ్ఞాపకశక్తితో ఎన్నెన్నో విషయాలు చెప్పడం ఆయనకు రివాజు. ముఖ్యంగా ఈస్టిండియా కంపెనీవారి చరిత్రకు సంబంధించిన సాక్ష్యాధారాలు, 18, 19 శతాబ్దాల ఆంధ్రదేశ సాంఘిక, రాజకీయ, ఆర్థిక సాంస్కృతిక చరిత్రపై వారి దగ్గర ఉన్నంత సమాచారం మరెవరి దగ్గరా లేదు. ఆ చారిత్రక సమాచారాన్ని వెలుగులోకి తేవడానికి ఆయన అహరహమూ కృషి చేసినా ఆయన పూర్ణాయుస్సు (96 సంవత్సరాలు) ఏ మాత్రం సరిపోలేదు. ఆయన మరణించేవరకూ ఆయన ఏదో ఒక విషయం మీద కృషిచేస్తూనే ఉండేవారు. టిప్పు సుల్తాన్ మీద ఆయన తలపెట్టిన పరిశోధన ఆయన మరణంతో అసమగ్రంగా నిలిచి పోయింది.

ఆయన వృత్తిచేతనే కాదు న్యాయవాది, ప్రవృత్తి చేత కూడా. ఎక్కడ అన్యాయం, అక్రమం, అత్యాచారం ఉన్న సహించలేని సత్యశీలుడు. ఆయన నిర్మోహమాటి, నిష్కల్మష హృదయుడు. ఆయన శారీరకంగా దుర్బలుడైనా మానసికంగా వజ్ర సంకల్పుడు. ఎవరిలో ఏ మాత్రం మంచి గుణం ఉన్నా మెచ్చుకుండా ఉండలేదు. అలాగే ఎవరైనా తనకు తెలియని విషయాలు రాసినప్పుడు, అసలు చరిత్రను మరుగుపరిచి వక్రీకరణ చేసినప్పుడు ఆయన

నిర్మొహమాటంగా పత్రికాముఖంగానే, ఉత్తరాలద్వారానే తెలియజేసేవారు. ఆ రకంగా ఆయన ఎన్నో వివాదాల మధ్య తాను నమ్మిన నిజం వైపు సుదృఢంగా నిలబడ్డారు. ఆయన సుదీర్ఘ జీవితకాలంలో ఆయన చరిత్ర రచనా యాత్ర అంతా ఇంతా కాదు.

శివరావుగారు రాసిన గ్రంథాలలో కొన్నిటిని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. 'రాజద్రోహనేరం మోపి ఎన్నో కేసులలో ఇరికించి ఇబ్బందుల పాలు చేసింది. అయినా ఆయన వెనుదీయలేదు. ఎంతో పూనికతో, పట్టుదలతో బ్రిటిష్‌వారు ఎన్ని కుట్రలతో, ఎన్నో కుహకాలతో అధికార పీఠం కైవసం చేసుకున్నారో చరిత్ర మరో కోణం నుంచి చూపి బట్టబయలు చేశారు. ఆయన రాసిన గ్రంథాలలో బ్రిటిష్ ఇండియా చరిత్ర, 1987 పూర్వరంగం, 1757-1857 స్వాతంత్ర్యసమరం, కథలుగాథలు (4 సంపుటాలు), ఆదివాసుల యుద్ధాలు, సన్యాసులు స్వాతంత్ర్య సమరములు, ఆఫ్రికా జాతీయోద్యమం, దక్షిణాఫ్రికా చరిత్ర, అధినివేశ స్వరాజ్యం, వ్యవహారకోశం, శాస్త్రి పరిభాష, విశాలాంధ్రం విస్మృతాంధ్రం, మన ఆంధ్రత్వం, హిందూ ధర్మశాస్త్రి సంగ్రహం, బెజవాడ న్యాయవాది సంఘచరిత్ర వంటివి ముఖ్యమైనవి. ఆయన సామాజిక సమస్యల పట్ల ఎంతో చైతన్యవంతమైన పాత్రను నిర్వహించారు. ఆయన పౌర ధర్మాలేమిటో తెలియజేసి 'ప్రజా ప్రభుత్వం', 'మన పోలీసు వ్యవస్థ' ఎలా ఉండాలో వ్యాసాలు, గ్రంథాలు రచించి, ఉద్యమాల్లో పాల్గొని ప్రజలను ప్రభుత్వాన్ని సక్రమపంథాలో నడిపించడానికి కృషి చేశారు. పారిభాషిక పదకోశం సభ్యులుగాను శాస్త్రి విజ్ఞాన చరిత్ర అకాదమి మండలి సభ్యులుగాను, విజయవాడ న్యాయవాద సంఘ అధ్యక్షుడుగాను, అనువాద కమిటీలో సభ్యులుగానుఆయన ఎంతో విలువైన సేవలు చేశారు.

వివిధ రంగాలలో ఆయన చేసిన సేవలకు కృతజ్ఞతా సూచకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 1966లో వారిని ఘనంగా సన్మానించింది. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు శివరావుగారి చారిత్రక సత్యనిరతికి, జాతీయ దృక్పథంపట్ల ఆయనకు గల అంకిత భావానికి మెచ్చి, చారిత్రక వీర పురుషేతివృత్తమైన 'ప్రళయ నాయడు' అనే రూపకాన్ని అంకితం చేశారు.

ఆయన ముఖ్యంగా ఆంధ్రులకు, ఆంధ్రదేశ చరిత్రకు మరో మహోపకారం చేశారు. ఏనుగుల వీరాస్వామయ్యగారు రచించిన కాశీయాత్ర చరిత్ర ద్వితీయ, తృతీయ ముద్రణలకు విలువైన పీఠికలు, ఫుట్‌నోట్సు, అనుబంధం, ఆనాటి వ్యవహార భాషకు అర్థాల పట్టిక సమకూర్చి తద్వారా ఆనాటి ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించిన వివరాలనెన్నిటినో అందించారు. ఏనుగుల వీరాస్వామయ్యగారు మరణించిన (3.10.1836) అక్టోబరు మూడోతేదీనే దిగవల్లి శివరావుగారు దివంగతులు కావడం (3.10.1992) కాకతాళీయమే అయినా దిగవల్లి శివరావుగారికీ, కాశీయాత్ర చరిత్ర గ్రంథకర్త అయిన ఏనుగుల వీరాస్వామయ్యగారికీ, తద్వారా ఆంధ్రదేశ చరిత్రకూ గల అవినాభావ సంబంధాన్ని చరిత్ర చెప్పకయే చెప్పుతున్నట్లు ఉన్నది. అంతటి చారిత్రక పురుషునికి తెలుగు అకాదమి వినమ్రంగా అంజలి ఘటిస్తున్నది.